క్లుప్తంగా

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు


ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్. కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం ఏకాదశి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ అనంతరం మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే కోట్లను కలిసిన డీఈఓ


కోట్లకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

డోన్ టౌన్: డోన్ ఎమ్మెల్యేగా ఎన్నికైన కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం డోన్‌లో ఎమ్మెల్యే కోట్లను డీఈఓ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పాఠశాలలు వాటి పరిస్థితులు, ఉపాధ్యాయుల సంఖ్య తదితర వాటిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రక్తదానం

డోన్ టౌన్: పట్టణంలో సోమవారం ఇద్దరికి రక్తం అవసరం కావడంతో దాతలు రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన సువర్ణ అనే నిండు గర్భిణికి ఏ పాజిటివ్ బ్లడ్‌ను మోహన్‌గౌడ్, అదే విధంగా కొండపేటకు చెందిన మహాలక్ష్మి అనే పేషెంట్ కు అవసరమైన ఓ పాజిటివ్ రక్తాన్ని దొరపల్లె మనక్షమర్ ఇచ్చారు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆలా మధు మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తదానం ప్రాణాలు కాపాడాలని కోరారు.

నిత్యాన్నదాన సంస్థకు రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాత తుమ్మలశెట్టి రామకృష్ణ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో నిర్వహిస్తున్న రైతు అన్నదాన సత్రానికి అనంతపురం పట్టణానికి చెందిన తుమ్మశెట్టి రామకృష్ణ కుటుంబ సభ్యులు రూ.లక్ష నగదును విరాళాన్ని అందించినట్లు రైతు అన్నదాన సంస్థ సెక్రటరీ బండి యాగంటి రెడ్డి సోవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు అన్నదాన సంస్థకు భక్తులు విరాళం అందించి తోడ్పాటునందించాలని కోరారు. దాత రామకృష్ణను సంస్థ తరపున సత్కరించారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోండి


లక్ష్మీబాయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ధైర్య సాహసాలకు మారుపేరైన ఝాన్సీలక్ష్మీబాయిని నేటి యువత ముఖ్యంగా బాలికలు ఆదర్శవతంగా తీసుకోవాలని సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ అన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన కార్యాలయ సమీపంలో అమె చిత్రపటానికి చిన్నారులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అమె జీవిత చరిత్ర, స్వాతంత్ర పోరాటంలో అమె పాత్రను వివరించారు.

నేటి నుంచి సుందరకాండ ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో 18 నుంచి 19వ తేదీ వరకు రెండు రోజుల పాటు సుందరకాండ ప్రవచనాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి, ఈఓ నాగప్రసాద్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 7గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైల దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


ప్యాపిలి ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


బేతంచెర్ల ఈద్గాలో ప్రసంగిస్తున్న మండల ఖాజీ నూర్ అహ్మద్


ఈద్గా వద్దకు భారీగా తరలివచ్చిన ముస్లింలు


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి: మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలో ఉదయం 7:30 గంటలకు స్థానిక మహబూబ్ సుభానీ కట్ట నుంచి ముస్లింలు ర్యాలీగా ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వ సర్‌ఖాజీ, హఫీజ్ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఈద్ ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబ్ ఖాన్ బక్రీద్ సందేశాన్ని వినిపించారు. తమకు అత్యంత ప్రీతిపాత్రమైన దాన్ని అల్లా కోసం త్యాగం చేసేందుకు వెనుకాకూడదన్నారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

బేతంచెర్ల: త్యాగానికి ప్రతికగా జరుపుకునే బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సిమెంట్‌నగర్, గూటుపల్లె, ఆర్‌యస్ రంగాపురం, యం. పేండెకల్లు, బలపాలపల్లె, హుస్సేనాపురం గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ముస్లింలు కొలుములపల్లె రహదారిలోని ఈద్గా వద్ద మండల ఖాజీ నూర్‌అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఖాజీ పండుగ విశిష్టతను వివరించారు.

డోన్ టౌన్ : బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణ సమీపంలోని గుత్తి రోడ్డుల్లో ఉన్న ఈద్గా మైదానంలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేకునఆరు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి ఈద్గా వద్దకు తరలి వెళ్లి ప్రార్థనల అనంతరం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

బనగానపల్లె రూరల్: ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే బక్రీద్ పండుగను సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఇల్లూరు కొత్తపేట, నందివర్గం, పలుకూరు, రామతీర్థం, బీరవోలు, యనకండ్ల, నందవరం, వెంకటాపురం, మీరాపురం, పసుపల తదితర గ్రామాల్లోని ముస్లింలు ఉదయం ఆయా గ్రామాల్లోని ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బనగానపల్లె ఈద్గా నగర్ కాలనీలో ఉన్న ఈద్గా, భానుముక్కలలో ఉన్న ఈద్గాలకు ముస్లింలు వెళ్లి ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. మత పెద్దలు బక్రీద్ ప్రముఖ్యత, ఖురాన్ బోధనలను వివరించారు.

బనగానపల్లె రూరల్: ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్‌ను సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అంకిరెడ్డిపల్లె కొలిమిగుండ్ల తుమ్మలపెంట, హనుమంతుగుండం తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ ప్రాముఖ్యాను మత పెద్దలు వివరించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



బనగానపల్లెలో పండుగ ప్రముఖ్యతను వివరిస్తున్న మతగురువు, కోవెలకుంట్లలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇబ్రహీం, ఇస్మాయిల్ జబీవుల్లా త్యాగాలను స్మరించుకుంటూ ఏటా జిల్‌హజ్ నెల 10వ రోజున వారి త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈదుల్ అజ్‌హాను పురస్కరించుకుని కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన ముస్లింలు ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి పట్టణ శివారులోని ఈద్గాకు చేరుకుని ఈదుల్ జుహా నమాజ్ చేశారు. అలాగే మండలంలోని బిజనవేముల, చిన్నకొప్పెర్ల, సొదరదిన్నె, రేవనూరు, కలుగొట్ల, జోళదరాశి, గుళ్లదూర్తి, కంపమల్ల, భీమునిపాడు గ్రామాల్లో ముస్లింలు ఆయా గ్రామాల్లోని మసీదుల్లో బక్రీద్ సందర్భంగా దువా చేశారు. పేదలకు తమ వంతు ఆర్థిక సాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ముస్లింలు వివిధ రూపాల్లో ఖుర్బానీ ఇచ్చారు.

సంజామల: ముస్లింలు రంజాన్ తరువాత అత్యంత ఘనంగా జరుపుకునే పండుగ బక్రీద్. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారు. బక్రీద్ సందర్భంగా సోమవారం మండల కేంద్రం సంజామలతో పాటు గ్రామాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఆయా గ్రామాల ఈద్గా మైదానాలలో బక్రీద్ పండుగ విశిష్టతను, కుర్బానీ గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.


బనగానపల్లె ఈద్గాలో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు


అంకిరెడ్డిపల్లెలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను కాకుండా యాజమాన్యాలే స్వయంగా ఫీజులను నిర్ణయించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రదీప్, మనోహర్, గణేష్, రాజా, రమేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏడీఈ మధుసూదన్ రెడ్డి, ఏఈలు శ్రీనివాసులు, మహబూబ్ వలి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఈ కాలంలో వర్షం కురుస్తున్న సమయంలో తడి చేతులతో విద్యుత్ బోర్డులు, వైర్లు, స్విచ్‌లను ముట్టుకోవద్దని సూచించారు. రైతులు బోరు మోటార్ ఆన్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు విద్యుత్ సరఫరాను పరీక్షించుకొని తడిలేని చెక్క లేదా ప్లాస్టిక్ వస్తువుతో ఆన్ చేసుకోవాలని చెప్పారు. అలాగే విద్యుత్ స్తంభాలను తాకవద్దని, పాడి రైతులు పశువులను స్తంభాలకు కట్టేయరాదన్నారు. గాలులకు తీగలు తెగిపడితే చేతి కాకుండా కర్రతో పక్కకు తొలగించి, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన రాజాబాబు మరో నాలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఇదే గ్రామానికి చెందిన నాగమద్దిలేటి అనే వ్యక్తిని కులం పేరుతో దూషించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన

పాణ్యం: బక్రీద్‌ను పురస్కరించుకుని పాణ్యం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నంద్యాల విజయ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 70 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. రక్తదానం వల్ల ఎలాంటి నష్టం ఉండదని.. అపోహలు వద్దని సూచించారు.

గ్రామ సచివాలయం కిటికీ ధ్వంసం



బనగానపల్లె రూరల్: మండలంలోని తమ్మడపల్లె గ్రామ సచివాలయం కిటికీ అద్దాలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. దీనిపై సోమవారం గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామానికే చెందిన కొందరు దుండగులు కావాలనే రాత్రి వేళ సచివాలయం వద్దకు వెళ్లి రాళ్లు విసిరి కిటికీ అద్దాన్ని పగులగొట్టారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ చేసిన మేలును ఓర్వలేక టీడీపీకి చెందిన వారే, ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. సచివాలయ అద్దాలను పగలగొట్టిన దుండగుడి గురించి తెలియలేదని, ఘటనపై బనగానపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.



తమ్మడపల్లె గ్రామ సచివాలయం కిటికీ అద్దాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

రమణీయం.. మహానందీశ్వరుని పల్లకోత్సవం



మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుదీర్చారు. బలిహారణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో స్వామివార్ల పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారి పల్లకీని మోస్తూ భక్తిని చాటుకున్నారు.

ఉమామహేశ్వర స్వామికి పల్లకీసేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వర స్వామివారికి పల్లకీ సేవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం అర్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


యాగంటి ఉమామహేశ్వర స్వామివారిని పల్లకీలో ఉంచి ఊరేగిస్తున్న దృశ్యం

అదనపు కట్నం కేసులో ముగ్గురిపై కేసు నమోదు

రుద్రవరం: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మండలంలోని పెద్దకంబలూరుకు చెందిన భవాని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. భవానికి మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా బెస్తవారి పేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతితో పెద్దలు వివాహం జరిపించారు. పెళ్లి అయిన కొద్ది రోజుల నుంచి భర్తతో పాటు అత్త కోటమ్మ, మామ నారాయణ ముగ్గురు అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించేవారు. అయినప్పటికీ ఆమె సర్దుకొని పోయేది. గత కొద్ది రోజుల నుంచి వేధింపులు అధికం కావడంతో భరించలేక పుట్టింటికి వచ్చేసింది. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

అదనపు పనులు చేయించరాదు

నంద్యాల(న్యూటౌన్): ఆశా కార్యకర్తలతో అదనపు పనులు చేయించరాదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నాగమణి అధ్యక్షతన నంద్యాల జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రమణ కుమారి మాట్లాడుతూ అదనపు పనులు చేయించరాదని, ప్రభుత్వం సర్క్యులర్ ఇచ్చినా అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బాలవెంకట్, ప్రభావతి, నాగలక్ష్మి, చెన్నమ్మ, సరస్వతి, కృపావతి, సుమలత, లక్ష్మిదేవి, జయమ్మ, చిన్నమ్మ పద్మావతి, రాజేశ్వరి, విజయమ్మ పాల్గొన్నారు.

ఘర్షణ.. కేసు నమోదు

చాగలమర్రి: మండలంలోని డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఏర్వ అరుణ అనే మహిళకు అదే గ్రామానికి చెందిన ఏర్వ శివ కోనిరెడ్డి మధ్య డబ్బుల విషయంలో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే శివ కోనిరెడ్డి తనను అసభ్య పదజాలంతో దూషించాడని, అడ్డు వచ్చిన తన భర్త రాజగోపాల్‌రెడ్డి, బంధువైన రవికుమార్‌రెడ్డిపై దాడి చేశాడని అరుణ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేసింది. ఈ మేరకు ఏర్వ శివ కోనిరెడ్డిపై సోమవారం కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

నేరేడు పండు.. పోషకాలు మెండు


తోపుడు బండిపై అమ్మకానికి ఉంచిన నేరేడు పండ్లు

కోడుమూరు రూరల్: వర్షాకాలం ప్రారంభంలో దొరికే నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. నేరేడు పండ్లలో కాల్షియం, ఐరన్, పొటాషియం, ఏ,సీ విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పెంచే ఎన్నో ఔషధ గుణాలు, బీపీ, షుగర్‌ను నియంత్రించే గుణం ఉండడంతో ప్రజలు విరివిగా ఈ పండ్లను కొంటున్నారు. కిడ్నీలో ఉండే రాళ్లను సైతం కరిగించే శక్తి ఉండడంతో నేరేడు పండ్లను తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆదోని, కోసిగి వంటి ప్రాంతాల నుంచి నేరేడు పండ్లను తీసుకొచ్చి కోడుమూరులో విక్రయిస్తున్నారు.

యాగంటీశ్వరుడి సేవలో మంత్రి

బనగానపల్లె రూరల్: రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి హోదాలో మొట్టమొదటిసారిగా సోమవారం దర్శించుకున్నారు. మంత్రి బీసీకి ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, అర్చకులు ఆలయ ప్రధాన ద్వారం నుంచి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం మంత్రి బీసీకి దుశ్శాలువా వేసి ఘనంగా సన్మానించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అర్చకులు అందజేశారు. పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బాలిరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

మద్దిలేటిస్వామిని దర్శించుకున్న మంత్రి బీసీ

బేతంచెర్ల: మండలంలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి వారిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. మంత్రి హోదాలో తొలిసారిగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఉపకమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం మంత్రి దంపతులకు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్ర పటంను అందజేసి, పట్టు వస్త్రంతో సత్కరించి వేదపండితులు ఆశీర్వచనం పలికారు.


యాగంటి ఉమామహేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

బంగారు వర్ణంలో భానుడు

సూర్యాస్తమ సమయంలో ఆకాశంలో అద్భుతాలకు కొదువే ఉండదు. వర్షాకాలంలో ఇలాంటి దృశ్యాలు మరింత అధికం. సోమవారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఆకాశం బంగారు వర్ణంలో కాంతులు వెదజల్లడంతో పట్టణ పరిసరాలు ఒక్కసారిగా పుత్తడి వర్ణంలో మెరిసిపోయాయి. ముఖ్యంగా రైల్వే స్టేషన్ పరిసరాలు కొత్తందాలను సంతరించుకున్నాయి. కర్నూలు,నంద్యాల రైల్వే గేట్ల మధ్య సూరీడు అందాలు మంత్ర ముగ్ధులను చేశాయి. సూర్యుడు మెల్లగా జారుకుటుండగా ఆకాశం పసిడి కాంతులతో వెలు గులీనిన దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. -డోన్ టౌన్



మహానందిలో తగ్గని భక్తుల రద్దీ

మహానంది: మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ తగ్గడం లేదు. వరుసగా రెండు రోజుల పాటు సెలవులు, సోమవారం ఏకాదశి కలిసి రావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి వేలాది సంఖ్యలో భక్తులు మహానందికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారికి మహా రుద్రాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. ఆర్జిత సేవల ద్వారా భక్తులు అభిషేకం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.


కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు